# సత్యవాక్కు

THE
WORD OF
TRUTH

క్రైస్తవ మాసపత్రిక

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు.

**తెలుగు — SATYA VANI**

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం 2-30 ని॥లకు

**ఇంగ్లీషు — THE VOICE OF TRUTH**

| | |
|---|---|
| సోమవారము | 9-00 to 9-15 p.m. |
| బుధవారము | 9-30 to 9-45 a.m. |

**హిందీ — SATYA SUSAMACHAR**

| | |
|---|---|
| మంగళవారము, గురువారము, శుక్రవారము | 9-00 to 9-15 p.m. |
| ఆదివారము | 1-30 to 1-45 p.m. |

**తమిళం — SATYA VAZHI**

| | |
|---|---|
| మంగళవారము | 5-30 to 5-45 p.m. |
| గురువారము, శుక్రవారము | 6-45 to 7-00 p.m. |

**మళయాళం — THE VOICE OF TRUTH**

| | |
|---|---|
| మంగళవారము, శుక్రవారము | 3-45 to 4-00 p.m. |

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.
తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరి ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి :

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
J. C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంచిక 9 | ఏప్రిల్ 1987 | సంపుటి 7


# సంపాదకీయము

## నీ వ్యాయామము ఎట్టిది

*(What kind of Exercise are you getting?)*

ఈ రోజుల్లో ప్రజలు వ్యాయామము మీద ఎక్కువ శ్రద్ధ చూపుచున్నారు. పరుగెత్తుట, జాగింగ్ చేయుట, నడచుట, సైకిలు తొక్కుట, ఈత కొట్టుట మొదలగు ఆటలెన్నో యున్నాయి. శారీరకంగా బలము, ఆరోగ్యము కలిగి యుండాలని ప్రజలు ప్రయత్నించుచున్నారు. దీని కవుసరమగు దుస్తులు, పరికరములు, ఆహారము మొదలగు సంగతులెన్నో ప్రజలు కొనుచున్నారు. ఇవన్నీ యున్నా, ప్రజలు చనిపోవుచునే యున్నారు.

మన శరీరాలను జాగ్రత్తగా యుంచుకోవడం మంచిదే. అయితే ఈ సందర్భములో అపొ. పౌలు యేమి చెప్పాడో తెలుసా? అంత్య దినములలో కొందరు విశ్వాస భ్రష్టు లవుతారని చెప్పి వారు బోధించే కొన్ని అబద్ధ సిద్ధాంతములను గూర్చి చెప్పిన తరువాత యౌవనస్థుడైన

తిమోతికి అతడిట్లు చెప్పాడు: "ఈ సంగతులను సహోదరులకు వివరించిన యెడల, నీవు అనుసరించుచు వచ్చిన విశ్వాస సుబోధ సంబంధమైన వాక్యములచేత పెంపారుచు క్రీస్తు యేసునకు మంచి పరిచారకుడవై యుందువు. అపవిత్రములైన ముసలమ్మ ముచ్చటలను విసర్జించి, దేవభక్తి విషయములో నీకు నీవే సాధకము చేసికొనుము. శరీర సంబంధమైన సాధకము కొంచెము మట్టుకే ప్రయోజనకరమవును గాని దైవభక్తి యిప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలో ప్రయోజనకరమవును" (1 తిమో 4:6-8).

శరీర సంబంధమైన వ్యాయామము కొంత మట్టుకే ప్రయోజనకరమవును గాని, దైవ సంబంధమైన వ్యాయామము ఈ జీవితంలోను, రాబోవు జీవితంలోను ప్రయోజనకరమైనదని పౌలు చెప్పుచున్నాడు. బలమైన ఆహారము పుచ్చుకొనునట్లు, అంటే దైవ సంబంధమైనలోతైన సంగతులు గ్రహించునట్లు క్రైస్తవుడు పెరుగవలెనని హెబ్రీ పత్రిక లేఖకుడు చెప్పుచున్నాడు. అభ్యాసము చేత వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియముల వలన యిది సంభవమగునని అతడు చెప్పుచున్నాడు (హెబ్రీ 5:14).

ఒకని మనస్సు మంచికి గాని, లేదా చెడుగుకు గాని అభ్యాసము చేయబడవచ్చునని పేతురు చెప్పుచున్నాడు. అతని కాలములో యున్న దుష్టులను గూర్చి చెబుతు అతడిట్లు వ్రాసాడు: "వ్యభిచారిణిని చూచి ఆశించుచు పాపము మానలేని కన్నులు గలవారును, అస్థిరులైన మనస్సులను మరలుకొల్పుచు లోభిత్వమందు సాధకము చేయబడిన హృదయము గలవారును శాపగ్రస్థులునై యుండి తిన్నని మార్గమును విడచి బెయోరు కుమారుడైన బిలాము పోయిన మార్గమును బట్టి త్రోవ తప్పిపోయిరి...."వీరు వ్యర్థమైన డంబపు మాటలు పలుకుచు

తామే శరీర సంబంధమైన దురాశలు గలవారై తప్పు మార్గమందు నడుచు వారిలోనుండి అప్పుడే తప్పించుకొనిన వారిని పోకిరి చేష్టల చేత మరలు కొల్పుచున్నారు. తామే భ్రష్టత్వమునకు దాసులై యుండియు, అట్టి వారికి స్వాతంత్ర్యము ఇత్తుమని చెప్పుదురు. ఒకడు దేనివలన జయింపబడునో దానికి దాసుడగును గదా. వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవ జ్ఞానము చేత ఈ లోకమాలిన్యములను తప్పించుకొనిన తరువాత మరల వాటిలో చిక్కుబడి వాటి చేత జయింపబడిన యెడల, వారి కడవరి స్థితి మొదటి స్థితి కంటె మరి చెడ్డదగును. వారు నీతిమార్గమును అనుభవ పూర్వకముగా తెలిసికొని, తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగిపోవుటకంటె ఆ మార్గము అనుభవ పూర్వకముగా తెలియకుండుటయే వారికి మేలు. కుక్క తన వాంతికి తిరిగినట్టును, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్ళినట్టును అను నిజమైన సామెతె చొప్పున వీరికి సంభవించెను" (2 పేతురు 2:14, 15, 18-22).

దుష్క్రియలను ఆలోచిస్తూ, అభ్యాసిస్తూ యుండువారికి సంభవించు దానిని గూర్చి పేతురు ఇక్కడ వివరించాడు. వారి అలవాట్లలో కొనసాగుచు తమ దుష్టత్వములోను దుర్నీతిలోను ఇంకా చెడిపోవుదురు. ఒకని జీవితంలో పాపం పెరిగిపోవుచు చివరకతని నాశనము చేయును (రోమా 6:23).

అయితే దైవ సంబంధమైన వ్యాయామాన్ని బాగుగా అర్థం చేసికొనునట్లు దానినెట్లు అభ్యసించాలో తెలిసికొందము. ఉదాహరణకు మనం చేయదగిన కొన్ని సాధకము లేమిటి?

మనము దేవుని వాక్యాన్ని చదువగలము, ప్రార్థనలో ఎక్కువ సమయాన్ని గడుపగలము., బీదలకు సహాయం చేయగలము, మంచి మాదిరి నెలకొల్పగలము, నశించిన వారికి సువార్త బోధించగలము,

మన ఆదాయంలో ఎక్కువ దేవునికియ్యగలము, ఒండొరుల యెడల నిష్కపట హృదయాన్ని కలిగి యుండగలము, క్షమించు హృదయం కలిగి యుండగలము, దేవుని ప్రేమించి ఇతరులను కూడ ప్రేమించగలము.

శరీర వ్యాయామము కష్టమైన పని, ఆత్మీయ వ్యాయామము కూడ కష్టమైన పనియే. దానిని చేయడానికి శ్రద్ధ కలిగి యుండాలి, ఇంకొక మాటలో నీవు నిశ్చయత కలిగి యుండాలి. అందువలనే అనేకులు దానిలో జయము పొందరు. రేపు చేద్దాంలే యని అనేకులు సమయాన్ని పొడిగిస్తారు, గాని ఆ రేపు ఎన్నడు రాదు. గనుక భౌతికంగా వారు అనారోగ్యము కలిగి, వయస్సు మీరక ముందే మరణిస్తారు. ఆత్మీయంగా వారు బలహీనులు, రోగులు. అనేకులు తొలగిపోయి మరణిస్తారు. బ్రదికిన వారు ఆత్మీయ అంగవిహీను లవుతారు.

తమ్మును తాము జాగ్రత్తగా కాపాడుకొన యత్నించువారే సాధారణంగా శరీర వ్యాయామము చేయువారు. వారు బహుశ ఆరోగ్యవంతులై ఎక్కువ కాలము జీవిస్తారు. ఆత్మీయముగా తమ జ్ఞానేంద్రియములను సాధకము చేసికొనువారు, దైవిక వ్యాయామము చేయువారు ప్రభువునందు ఆయన పనియందు బలవంతులై యుంటారు. ప్రభువుకొరకు పనులను సాధించువారు వీరే. వారట్లు చేయుకొలదీ ప్రభువు వారిని ఇంకా వినియోగించుకొంటాడు, జీవిస్తాడు.

ఆత్మీయ వ్యాయామములో క్రైస్తవునికి సహాయపడు నిమిత్తము పేతురు ఇట్లు చెప్పుచున్నాడు: "తన మహిమను బట్టియు గుణాతిశయమును బట్టియు మనలను పిలిచినవాని గూర్చిన అనుభవ జ్ఞాన మూలముగా ఆయన దైవశక్తి జీవమునకును భక్తికిని కావలసిన వాటి నన్నిటిని మనకు దయచేయుచున్నందున దేవుని గూర్చినట్టియు మన ప్రభువైన యేసును గూర్చినట్టియునైన అనుభవ జ్ఞాన మూలము వలన మీకు కృపయు సమాధానమును విస్తరించును గాక. ఆ మహిమ

గుణాతిశయములను బట్టి ఆయన మనకు అమూల్యములును అత్యధిక
ములునైన వాగ్దానములను అనుగ్రహించి యున్నాడు. దురాశను అనుసరించుటవలన లోకమందున్న భ్రష్టత్వమును ఈ వాగ్దానముల మూలముగా మీరు తప్పించుకొని, దేవ స్వభావమందు పాలివారగునట్లు వాటిని అనుగ్రహించెను. ఆ హేతువు చేతనే మీ మట్టుకు మీరు పూర్ణ జాగ్రత్త గలవారై మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి. ఇవి మీకు కలిగి విస్తరించినయెడల అవి మన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అనుభవ జ్ఞాన విషయములో మిమ్మును సోమరులైనను నిష్ఫలులైనను కాకుండ చేయును. ఇవి ఎవనికి లేకపోవునో వాడు తన పూర్వపాపములకు శుద్ధి కలిగిన సంగతి మరచిపోయి, గ్రుడ్డివాడును దూరదృష్టి లేనివాడును అగును. అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు. ఆలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్యరాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును. కాబట్టి మీరు ఈ సంగతులను తెలిసికొని మీరంగీకరించిన సత్యమందు స్థిరపరచబడి యున్నను వీటిని గూర్చి ఎల్లప్పుడును మీకు జ్ఞాపకము చేయుటకు సిద్ధముగా ఉన్నాను" (2 పేతురు 1 : 2-12).

మిత్రుడా, నీవెట్టి వ్యాయామము చేయుచున్నావు? ప్రస్తుత కాలపు జీవితానికి ప్రాముఖ్యత అంతా నీవు ఇచ్చుచుండ వచ్చునుగాని చివరకు దాన్ని పోగొట్టుకొంటావు. "శరీర సంబంధమైన సాధకము కొంచెము మట్టుకే ప్రయోజనకరమగును. గాని దైవభక్తి యిప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములోను వాగ్దాన

ముతో కూడిన దైనందున అది అన్ని విషయములలోను ప్రయోజ
కరమవును" (1 తిమో 4 : 8). ఈ లోకములోను, రాబోవు లోకవ
లోను కూడ శ్రేష్టమైన వాటిననుభవించు క్రైస్తవుడే జ్ఞానవ
కలవాడు.

---

## సు వా ర్త పి లు పు

### *( Gospel Call )*

ఈ దినములలో దేవుడు ప్రజలను రక్షణలోనికి ఎట్లు పిలుచు చున్నాడో యని తెలియజేయు అనేక భావములు కలవు. మనము కొన్ని ముఖ్య భావములను పరిశీలించుదము. కొందరు దేవుడు వారితో చిన్నస్వరముతో మాట్లాడునని బోధించుదురు. మరికొందరు క్రీస్తు వారికి స్వప్నములలోను, దర్శనములలోను కనబడునని చెప్పుదురు. ఇంకాకొందరు ప్రభువు ఏదోయొక ప్రత్యేక అనుభవముద్వారా పిలుచునని విశ్వసించుదురు. ఈ మూడు వర్గములవారు, ఇదియే ప్రభువు రక్షించు పద్ధతి లేక ప్రత్యేక సందేశమునిచ్చు పద్ధతి యని భావింతురు. కాని బైబిలు గ్రంథము ఇట్లు చెప్పుచున్నదా ? ఇక్కడ ఒక హెచ్చరిక యున్నది. ఎల్లప్పుడు వినుచున్నాము, చూచుచున్నా మని చెప్పువారి యెడల అనుమానము కల్గియుండవలెను.

మొదటగా మనము తెలుసుకొనవలసిన విషయము: ఈ దినము లలో దేవుడు మాట్లాడెనా ? అయిన యెడల ఎట్లు మాట్లాడెను ? మనము హెబ్రీ 1 : 1, 2 చూచిన తేలికగా కనబడును. "పూర్వకాల మందు నానా సమయములలోను నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈదినముల అంతమందు కుమారునిద్వారా మనతో మాట్లాడెను. ఆయన ఆ కుమారుని సమస్త మునకు వారసునిగా నియమించెను. ఆయనద్వారా ప్రపంచములను

ఋప్పించెను." కనుక దీని ప్రకారముగా దేవుడు ఈదినము కూడా మాట్లాడును. అది ఆయన కుమారునిద్వారా మాట్లాడును. ఇది మత్తయి 17:5లో క్రీస్తు రూపాంతర సమయమునందు చూపించెను. దేవుని మాట నాలకించుము, "ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడి."

తరువాత ప్రశ్న : దేవుడు ఈదినమున మానవునితో స్వయముగా మాట్లాడునా లేక క్రీస్తు స్వయముగా మాట్లాడునా? ఈదిగువ వాక్యములు చదువునపుడు ఈ సందేహములు పోవును: "మరియు అనేకమైన యితర సూచకక్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను. అవి ఈ గ్రంథమందు వ్రాయబడి యుండలేదుగాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30, 31). ఈ సంగతు లెందుకు వ్రాయబడెను? మనము విశ్వసించుటకు. ఎక్కడ ఈ సంగతులు వ్రాయబడెను? నూతన నిబంధన గ్రంథమందు. కావున మనము దానిని చదివి అందలి సంగతులు పరిశీలించిన యెడల దేవుని చిత్తమును గ్రహించగలము.

రోమా 10:17లో ఈలాగునున్నది: "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తునుగూర్చిన మాటవలన కలుగును". ప్రశ్న : విశ్వాసము మరి యేవిధముగానైన కల్గునా? అట్లు కలిగిన యెడల అది లేఖనముల ప్రకారముకాదు. అనుభవ పూర్వకముగా దీని విషయమై మాట్లాడు వారు కలరు కాని దేవుని వాక్యము దీనిని చెప్పటలేదు. దేవుని వాక్యమును వినుటద్వారా విశ్వాసము కలుగునని అది బోధించుచున్నది. కావున బైబిలు గ్రంథ మొక్కటే, విశ్వాసమొక్కటే (ఎఫెసీ 4 : 5).

దేవుని వాక్యమును వినుటద్వారా విశ్వాసము కలుగును

కావున వాక్యమును పరిశీలించుట (2 తిమోతి 2 : 15), లేఖనములను వెదకుట (యోహాను 5 : 39) యందలి ప్రాముఖ్యత మనకు బోధించ బడెను. అందువలననే లేఖనములు దైవ ప్రేరితమైనవని, అవి పరిపూర్ణ ములని బహుగా నొక్కి వక్కాణించబడెను (2 తిమోతి 3:16, 17).

సువార్త మంటి పాత్రలలో నుంచబడినదని లేఖనములు చెప్పుచున్నవి. అపొస్తలుడైన పౌలును వినుము : "అంధకారములోనుండి వెలుగు ప్రకాశించునుగాక అని పలికిన దేవుడే తన మహిమను గూర్చిన జ్ఞానము యేసుక్రీస్తునందు వెల్లడి పరచుటకు మా హృదయ ములలో ప్రకాశించెను. గనుక మేము మమ్మునుగూర్చి ప్రకటించు కొనుట లేదుగాని, క్రీస్తు యేసునిగూర్చి ఆయన ప్రభువనియు, మమ్మునుగూర్చి యేసు నిమిత్తము మేము మీ పరిచారకులమనియు ప్రకటించుచున్నాము. అయినను బలాధిక్యము మా మూలమైనది కాక దేవునిదై యుండునట్లు మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు" (2 కొరింథీ 4:5-7). ఇక్కడ అతడేమి చెప్పుచున్నాడు! తనతోటివారికి సువార్త నందించుటకు పౌలువలె ప్రత్యేక వ్యక్తులను ప్రభువు ఎన్నుకొని యున్నాడని చెప్పుచున్నాడు. అపొస్తలుల కార్య ములలోని వివిధ మత మార్పులనుగూర్చి ఆలోచించుము. రక్షణ పొందుటకు ఏమిచేయవలెనో ఒక్క వ్యక్తికి ప్రభువు చెప్పిన యుదంత మును యివ్వగలవేమో చూడుము. నీవు ఈయలేవు. అపొస్తలుల కార్యములు 8వ అధ్యాయములో ప్రభువు దూత నపుంసకునికి క్రీస్తును బోధించుమని ఫిలిప్పును పంపినట్లు కలదు. ప్రశ్న : ఫిలిప్పును సమ రయలో ప్రజలకు బోధించుటకు వదలి దూత ఎందుకు వెళ్లలేదు! ఎందుచేతననగా సువార్తను మంటి ఘటములలో ప్రభువు ఉంచి యున్నాడు, మానవుడే ఆ సువార్త సందేశము నందజేయవలసి యున్నది. మరల అపొస్తలుల కార్యములు 9వ అధ్యాయములో పౌలు రక్షణ పొందుటకు ఏమిచేయవలెనని ప్రభువును అడుగు

చున్నాడు. నీవు పట్టణములోనికి వెళ్లుము. అక్కడ నీవేమి చేయవలెనో తెలియపర్చబడునని ప్రభువు చెప్పెను. తరువాత అననీయ వెళ్లి అత నికి సువార్త నందించి యున్నాడు (అ.కా. 22 : 16). ప్రశ్న : ప్రభువు అతనికి ఎందుకు చెప్పలేదు? ఎందుకనగా అది ఆయన చిత్తము కాదు. ఇట్టి విధముగనే మార్పుజెందినవారి మిగిలిన సందర్భము లున్నవి. ఈ కారణమువలననే ప్రభువు మనుష్యులతో ఈ దినములలో స్వయముగా మాట్లాడుట లేదనియు, (లేఖనములద్వారా కాక) ఏమి చేయవలెనో చెప్పుటకు ప్రత్యక్షమగుట లేదనియు మన మెరుగుదుము. ప్రభువు ఇప్పుడిక్కడనున్న ను ఒకనికి ఏమి చేయవలెనో తెలియజేయడు (అ. కా. 9). ఒకవేళ ఆయన చెప్పినను ఇదివరకు ప్రకటించబడిన సువార్తకు వేరుగా యుండదు (గలతీ 1:6-9). కనుక మానవుని చేయ మని ఆజ్ఞాపించిన దానిని ప్రభువువచ్చి చేయుటలో ఉద్దేశము కనబడదు (మార్కు 16 : 15, 16). మరియొకరీతిగా చెప్పవలెననిన మానవుడు చేయగలదానిని ప్రభువు చేయడు.

సువార్త మంటి ఘటములలో యుంచబడుటవలన బోధకులు సువార్తను ఇతరుల కందించుటనుగూర్చిన ప్రాముఖ్యత గట్టిగా నొక్కి చెప్పబడెను. క్రీస్తు ఇట్లు చెప్పెను: "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15, 16). రోమా 10:13-15 లో ఈలాగున కలదు : "ఎందుకనగా ప్రభువు నామమునుబట్టి ప్రార్థనచేయువా డెవడో వాడు రక్షింపబడును. వారు విశ్వసింపనివానికి ఎట్లు ప్రార్థన చేయుదురు ? విననివానిని ఎట్లు విశ్వ సించుదురు ? ప్రకటించువారు పంపబడనియెడల ఎట్లు ప్రకటించుదురు? మంచి విషయమై ఉత్తమమైనవాటిని గూర్చిన సువార్త ప్రకటించు వారి పాదములెంతో సుందరమైనవి అని వ్రాయబడియున్నది". కనుకగా "వాక్యమును ప్రకటించుము. సమయమందును, అసమయ

మందును ప్రయాస పడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము" (2 తిమోతి 4 : 2). ప్రభువు మధ్యరకపు సాధనముద్వారా ఆయన చిత్తమును తెలియజేయుటకు ఏర్పరచుకొనినట్లు నీవు చూడగలవు. ఇది యెంతో సామాన్యముగా నున్నది.

ఇది సత్యము కనుక, పౌలు థెస్సలొనీకయులకు వ్రాయుచున్నాడు: "మీరీలాగు రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమను పొందవలెనని, ఆయన మా సువార్తవలన మిమ్మును పిలిచెను" (2 థెస్స 2 : 14). పిలిచినది పౌలా ? ప్రభువు థెస్సలొనికయవారిని సువార్తద్వారా పిలిచెనని పౌలు చెప్పుచున్నాడు. అనగా, పౌలు వారికి సువార్త బోధించెను, వారు విని అంగీకరించిరి; వారు ఈవిధముగా క్రీస్తు నొద్దకు పిలువబడిరి. మరియొక విధముగా చెప్పవలెననిన, సువార్త బోధలద్వారా క్రీస్తు వారిని రక్షణలోనికి పిలిచెను.

ఇప్పుడు ఈదినము సంగతి ఏమి ? మనము ఎట్లు పిలువబడితిమి? క్రైస్తవులమైన మనము ఈ సువార్త ద్వారానే పిలువబడితిమి. అనగా సువార్త మనకు బోధింపబడినది. మనము వినియున్నాము, నమ్మియున్నాము. అంగీకరించియున్నాము, ప్రభువు మనలను రక్షించెను. మనము సువార్తను ఇతరులకు అందజేసినపుడు ఇదియే పదేపదే జరుగును. ప్రభువు ఒకనిని ఒక విధముగాను, మరియొకనిని మరియొక విధముగాను పిలుచుటలేదు. ఆయన అందరినీ ఒకే సువార్త ద్వారా పిలుచుచున్నాడు.

ఔను, దేవుడు మాట్లాడును, కాని ఆయన క్రీస్తుద్వారా మాట్లాడును. క్రీస్తును అంగీకరించినవారికి సువార్తను ఇతరులకు బోధించుటకు, ప్రకటించుటకు బాధ్యత కలదు. ఈపద్ధతి ద్వారా

ప్రభువు, సువార్త పరిచారకుడు లేక బోధకునిద్వారా ఆయన చిత్తము బయల్పరచి నశించినవారిని ఆయన యొద్దకు ఆహ్వానించుచున్నాడు (మత్తయి 11 : 28-30).

మన మొదటి బాధ్యత సువార్తను బోధించుట, రెండవది ప్రభువును అంగీకరించినవారికి సహాయము చేయుట (మత్తయి 28 : 19, 20). ఇందుచేతనే పౌలు ఇట్లు వ్రాసెను, "బాప్తిస్మమిచ్చుటకు క్రీస్తు నన్ను పంపలేదుగాని, క్రీస్తు యొక్క సిలువ వ్యర్థము కాకుండునట్లు, వాక్చాతుర్యము లేకుండ సువార్త ప్రకటించుటకే ఆయన నన్ను పంపెను. సిలువను గూర్చిన వార్త నశించుచున్నవారికి వెర్రితనము కాని రక్షింపబడుచున్న మనకు అది దేవుని శక్తి" (1 కొరింథి 1 :17, 18). కనుక అతడు చెప్పుచున్నాడు. మనుష్యులకు బాప్తిస్మమిచ్చుటకు అతడు పంపబడలేదు. అతని మొదటి బాధ్యత సువార్తను ప్రకటించుట. స్వాభావికముగా ప్రభువును అంగీకరించినవారికి బాప్తిస్మమిచ్చుటకు సిద్ధపడి యుండుట.

ఇంతకు పూర్వము నీవు సువార్తను వినియున్నావా? లేనియెడల యిప్పుడు సువార్త పిలుపును అందుకొనుచున్నావు—క్రీస్తు నొద్దకు రమ్మను పిలుపు—ఆయనకు విధేయుడవు కమ్ము. ఆయన నిన్ను రక్షించును.

— జె. సి. ఫోట్

---

## అక్షరము చంపును

### *(The Letter Killeth)*

"అక్షరము చంపును గాని ఆత్మ జీవింపచేయును" (2 కొరింథీ 3:6). ఈ అధ్యాయమునందు పాత, క్రొత్త నిబంధనలకు గల తారతమ్యము గూర్చియు, క్రొత్త నిబంధన యొక్క శ్రేష్ఠతను గూర్చియు

పౌలు వివరించెను. పాత, క్రొత్త నిబంధనలు రెండును ఆత్మ వలన కలిగినవే. నేడు ఈ రెండును అక్షరరూపముననే లభ్యమగుచున్నవి. పౌలు ఈ పత్రికను వ్రాయుసరికి క్రొత్త నిబంధన అప్పటి కింకను సంపూర్తిగా వ్రాయబడలేదు. సంఘపు ఆరంభ సమయములో ఈ లేఖకులు ఆత్మవలననే నడిపింపబడిరి. "దేవుడు సంఘములో మొదట కొందరిని అపొస్తలులుగాను, పిమ్మట కొందరిని ప్రవక్తలుగాను, అటు పిమ్మట కొందరిని బోధకులుగాను......నియమించెను" (1 కొరింథీ 12:28). సంఘములో 'మొదటిగా' అద్భుత సంబంధమైన ఆత్మవలన నడిపింపబడిరి. ఆ ఆత్మవలననే లేఖనములను వ్రాసి, అక్షరరూపముగా మన తరము కొరకు జాగ్రత్త చేసిరి (2 పేతురు 1:15). మనము కలిగి యున్న దేవుని వాక్యము ఆత్మవలన లిఖింపబడి అక్షరరూపమున ఉన్నది. పాత నిబంధన మరణకారణమైన పరిచర్య అనియు, క్రొత్త నిబంధన జీవింపచేయు పరిచర్య అనియు పౌలు చెప్పెను (2 కొరింథీ 3:7). కనుక "అక్షరము" అనగా పాతనిబంధనగను, ఆత్మ అనగా క్రొత్త నిబంధనగను గ్రహింప వీలగుచున్నది.

"ధర్మశాస్త్రము పరిశుద్ధమైనది, ఆజ్ఞ కూడ పరిశుద్ధమైన దనియు నీతిగలదనియు ఉత్తమమైనదనియునై యున్నది" (రోమా 7:12). దేవుని నీతియైన ధర్మశాస్త్రము మరణకరమాయెనా? అట్లన రాదు. అయితే అది మనలను ఎట్లు చంపగలదు? ఆ చట్టము కనీసము రెండు విధములుగా చంపగలదు.

**1.** శారీరకముగా : ఆ మొదటి చట్టము అమలులో యున్న కాలమున అది పాపులను నిర్దాక్షిణ్యముగా చంపుచు యుండెను. పాపము చేసినవాడి మారుమనస్సు పొందు తరుణమును అది ఇయ్య లేదు. దోషిని రాళ్ళతో కొట్టి చంపుటయే శిక్ష. ఎవడైనను సాహ సించి పాపము చేసినయెడల వారు యెహోవాను తృణీకరించినవాడగును.

గనుక అట్టివాడు నిశ్చయముగా జనులలో నుండకుండ కొట్టివేయబడును. గనుక నే విశ్రాంతి దినమున కట్టెలు ఏరినవానిని సర్వసమాజము పాళెము వెలుపల రాళ్ళతో వాని కొట్టి చంపిరి (సంఖ్యా 15:30-36). ఆకాను యెహోవాకు విరోధముగా పాపము చేసినందున ఇశ్రాయేలీయులందరు వానిని రాళ్ళతో చావగొట్టిరి (యెహో 7:20-26). అటులనే వ్యభిచారమందు పట్టుబడిన ఒక స్త్రీని యేసునొద్దకు తోడుకొని వచ్చిరి. మోషే ధర్మశాస్త్ర ప్రకారము ఆ స్త్రీని రాళ్ళు రువ్వి చంపవలసియుండెను. గాని దయాపూర్ణుడైన క్రీస్తు ఆవిధముగా చేయనియ్యలేదు. క్రీస్తు చనిపోవు వరకు ఆయన చట్టము అమలులోనికి రాకున్నను (హెబీ్ర 9:16, 17), ఆయన జీవించి యున్నప్పటినుండే క్రొత్త చట్టమును బోధింప మొదలిడెను (మత్తయి 5:22, 28).

యేసు తలయెత్తి చూచి – అమ్మా, వారెక్కడ ఉన్నారు? ఎవరును నీకు శిక్ష విధింపలేదా? అని అడిగినప్పుడు, ఆమె - లేదు ప్రభువా అనెను అందుకు యేసు "నేనును నీకు శిక్ష విధింపను; నీవు వెళ్లి ఇక పాపము చేయకుము" అని ఆమెతో చెప్పెను (యోహాను 8:1-11). రెండవ చట్టప్రకారము నరహత్య చేయనక్కరలేదు గాని సహోదరుని ద్వేషించువాడే నరహంతకుడని యేసు బోధించెను. "నేను వారి దోషముల విషయమై దయకలిగి వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొనననని ప్రభువు సెలవిచ్చుచున్నాడు" (హెబీ్ర 8:12). అందువలన పాత చట్టము శారీరకముగా దోషిని చంపును గాని క్రొత్త చట్టము శారీరకముగా జీవింపజేయును.

2. ఆత్మీయముగా : ఆత్మీయముగా చనిపోవుట అనగా రెండవ మరణమైన నరకములో పాలుపొందుట (ప్రకటన 21:8). మొదటి చట్టప్రకారము చంపబడిన పాపులు మారుమనస్సు పొందే అవకాశము లేనందువలన వారు ఆత్మీయ మరణానికి పాత్రులైరి.

ప్రతి ప్రధానయాజకుడును మనుష్యులలో నుండి యేర్పరచబడినవాడై పాపముల కొరకు అర్పణలను బలులను అర్పించుటకు నియమింపబడెను...ఆ హేతువుచేత ప్రజలకొరకేలాగో తన కొరకును పాపముల నిమిత్తము అర్పణము చేయవలసినవాడై యుండెను (హెబ్రీ 5:1-3). ఇశ్రాయేలీయులు పాపపరిహారార్థ బలులు అర్పించిరి (హెబ్రీ 10:2, 3). అయినను వారిని ఆ మొదటి నిబంధన పాపవిముక్తులనుగా ఎందుకు చేయజాలక పోయెను? "ఒకడు పొరపాటున పాపముచేసిన యెడల వాడు పాపపరిహారార్థ బలిగా ఏడాది ఆడు మేకపిల్లను తీసికొని రావలెను. పొరపాటున యెహోవా సన్నిధిని దాని చేసెను గనుక తెలియకయే పాపముచేసిన వాని నిమిత్తము యాజకుడు ప్రాయశ్చిత్తము చేయును; వాని నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుటవలన వాడు క్షమాపణ నొందును" (సంఖ్యా 15:27, 28; లేవీ 4:2, 3, 13-31). పొరపాటున పాపము పేసినవారు మాత్రమే పాపపరిహారార్థ బలి యిచ్చి క్షమాపణ నొందిరి. గాని సాహసించి పాపముచేసిన వానికి శరీరమరణము సంభవించెను. తద్వారా ఆత్మీయ మరణము వచ్చును.

## ఆ పాత చట్టము నేడు మనలను ఎట్లు చంపగలదు?

"క్రీస్తునందు జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము పాపమరణముల నియమమునుండి నన్ను విడిపించెను. ఎట్లనగా ధర్మశాస్త్రము దేనిని చేయజాలకపోయెనో దానిని దేవుడు చేసెను (రోమా 8:2). యూదుడైన పౌలు ధర్మశాస్త్రమునుండి విడుదలపొంది క్రొత్త చట్టమునకు లోబడుటవలన క్రైస్తవుడాయెను. మనము యూదులము కాము గనుక ధర్మశాస్త్రమునుండి విడుదల పొందనవసరము లేదు, ధర్మశాస్త్రమను దాస్యముక్రిందకు వెళ్లి ఆ మోయలేని భారమును మనపై వేసుకొనక్కరలేదు. ఏలయనగా ఆ మొదటి నిబంధన క్రీస్తునందు సిలువలో కొట్టివేయబడి మనకు అడ్డము లేకుండా ఎత్తివేయ

బడెను (కొలస్స 2:14; ఎఫెసీ 2:14; 2 కొరింథీ 3:14). "విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు" (రోమా 10:4).

"మీలో ధర్మశాస్త్రమువలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులోనుండి బొత్తిగా వేరుచేయబడి యున్నారు; కృపలోనుండి తొలగిపోయి యున్నారు" (గలతీ 5:4). "ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధు లందరు శాపమునకు లోనై యున్నారు" (గలతీ 3:10). నేడు ఎవరైనను ధర్మశాస్త్ర సంబంధమైన విధులకు లోబడినట్లయితే వారు క్రీస్తులోనుండి వెరుచేయబడుదురు. వారు ఆత్మీయ మరణములో పాలుపొందుదురు యని క్రొత్త నిబంధన తేటగా బోధించుచున్నది. ధర్మశాస్త్రము లేక అక్షరము దానికి లోబడిన వారిని ఆత్మీయముగా చంపగలదు. "అంతరంగమందు యూదుడైన వాడే యూదుడు, అక్షరమువలన కలుగునది కాదు గాని ఆత్మయందు జరుగునదే (రోమా 2:28). "గనుక మనము అక్షరానుసారమైన ప్రాచీన స్థితి గలవారము కాక ఆత్మానుసారమైన నవీన స్థితిని గలవారమై సేవ చేయుచున్నాము" (రోమా 7:6).

—ప్రభుదాస్ సబ్బతి, గుంటూరు.

---

## మనలో నివసించు పరిశుద్ధాత్మ

## *(Indwelling of Holy Spirit)*

I అపొస్తలుల కార్యములు 2:38లో రెండు వాగ్దానములున్నవి

1. పాప క్షమాపణ
2. పరిశుద్ధాత్మ అను వరము.

II (1) పరిశుద్ధాత్మ సువార్తకు విధేయులైన వారికి అనుగ్రహింపబడును. అపొ.కా. 5:32.

2. పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడి యున్నది. రోమా 5:5.

3. పరిశుద్ధాత్మ దేవుని ద్వారా మన హృదయముల లోనికి పంపబడెను. గలతి 4:6.

4. పరిశుద్ధాత్మను కలిగియుండుటయే క్రీస్తువానిగా నుండుట. రోమా 8:9.

5. పరిశుద్ధాత్మ మనలో నివసించునట్లు వాగ్దానము చేయబడెను. రోమా 8:10-11.

6. పరిశుద్ధాత్మ క్రైస్తవుల యందు నివసించును. 1 కొరింథీ 6:18-20.

7. పరిశుద్ధాత్మ సంఘములో నివసించును. 1 కొరింథీ 3:16-17.

8. పరిశుద్ధాత్మ పౌలునందు, తిమోతినందు నివసించెను. 2 తిమోతి 1 : 14.

9. పరిశుద్ధాత్మ తానే మన ఆత్మతో కూడ సాక్ష్య మిచ్చుచున్నాడు. రోమా 8:16, మత్త 28:19, 1 కొరింథీ 12:13.

10. మనము పరిశుద్ధాత్మ సహవాసమును కలిగియున్నాము. 2 కొరింథీ 13:14.

11. మనము ఆత్మ పూర్ణులమై యుండవలెను. ఎఫెసీ 5:18.

III (1) మనలను పరిశుద్ధ పరచుటయే పరిశుద్ధాత్మ పని యోహా 17 : 17. పరిశుద్ధ పరచబడుట అను మాటకు వాడబడిన ఆంగ్ల పదము "Sanctify" ఇది రెండు లాటిన్ పదముల సంయోగము

1. SANCTUS = HOLY
2. FACIO = TO MAKE } To make holy

పరిశుద్ధాత్మ క్రీస్తునందు జన్మించిన శిశువును ఆయనలో ఒక పరిపూర్ణ మానవునిగా చేయుటలో సహకరించును. (క్రీస్తు స్వరూపము మనయం దేర్పడవలెనని దేవుడు కోరుచున్నాడు. గలతి 4:19).

2 పరిశుద్ధపరచబడుట అనగా : పరిశుద్ధాత్మ కలిగించు అభివృద్ధి నీతియు యదార్థమైన భక్తియు గలవారమై క్రీస్తులో జీవించు అభివృద్ధియై యున్నది. ఎఫెసీ 4:22-24.

3 పరిశుద్ధాత్మ ఫల మేమనగా : గలతి. 5:22.

1. ప్రేమ
2. సంతోషము
3. సమాధానము
4. దీర్ఘ శాంతము
5. దయాళుత్వము
6. మంచితనము
7. విశ్వాసము
8. సాత్వికము
9. ఆశా నిగ్రహము

మీరు వారి ఫలముల వలన వారిని తెలిసికొందురు. మత్త 7:20 రోమా 7:4.

IV (1) మనము ఆత్మ ననుసరించి నడుచుకొనవలెను. పరిశుద్ధాత్మ మనయందు నివసించుచున్నాడు. గలతి 5:25.

2. మనము క్రీస్తులో నివసించవలెను. క్రీస్తు మనయందు నివసించుచున్నాడు.

3. మనము దేవునిలో నివసించవలెను. దేవుడు మనయందు నివసించుచున్నాడు.

4. ఈ ముగ్గురుద్వారా మనము మన క్రైస్తవ జీవితమునందు అభివృద్ధి చెందవలెను లేదా ఎదుగవలెను. క్రీస్తు చెప్పిన మాటలే ఆత్మయు జీవమునై యున్నవి (యోహా 6:63). ఆత్మలో ఎదుగవలెనన్న దేవుని వాక్యములో ఎదుగవలెను. దేవుని వాక్యము ద్వారానే పరిశుద్ధాత్ముడు మనలో నివసించును,

—వెరోన్.

# క్రీస్తువారి రెండవ రాకడ

## (గత సంచిక తరువాయి)

—విక్టర్ డి. తురాక, తెనాలి.

**C.** యేసుక్రీస్తువారు మరల వచ్చినప్పుడే న్యాయ తీర్పు :

మత్తయి 16:27 - "మనుష్య కుమారుడు తన తండ్రి మహిమ గలవాడై తన దూతలతో కూడ రాబోవుచున్నాడు. అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ప్రతిఫల మిచ్చును." మనుష్య కుమారుడు వచ్చినప్పుడే మంచివారికి, చెడ్డవారికి కూడా ఫలమిచ్చును. గనుక ఇద్దరికొరకు రెండుసార్లు వచ్చుట యున్నదా? లేదు.

మార్కు 8:38 - "వ్యభిచారమును, పాపమునుచేయు ఈ తరము వారిలో నన్నుగూర్చియు, నా మాటలను గూర్చియు సిగ్గుపడువా డెవడో, వానిని గూర్చియు, మనుష్య కుమారుడు తన తండ్రి మహిమ గలవాడై వచ్చునప్పుడు సిగ్గుపడునని చెప్పెను."

పై వాక్యములోని కాలము 'వెయ్యేండ్ల పాలన' వారు చెప్పు చున్న Rapture కాలమును చూపుచున్నది గదా! కాని, ఆ కాలమే తీర్పు కాలముగా ప్రభువు చెప్పుచున్నాడు. అదే వారిపైన తీర్పు (తనను గూర్చి సిగ్గుపడినవారిని గూర్చి సిగ్గుపడుట). దీనిని బట్టి "వెయ్యేండ్ల పాలనవారి" సిద్ధాంతమునకు విరుద్ధముగా "తీర్పు" వెయ్యి సంవత్సరములు ముందుగా జరిగినది.

**D.** యేసుక్రీస్తువారి రాకడ సందర్భముగా రెండు పునరుత్థానములు లేవు :

అ.కా. 23:6లో అపొస్తలుడైన పౌలు "మృతుల పునరుత్థానమును" గూర్చి విమర్శింపబడుచున్నట్లు తెలిపెను.

అ. కా. 24:15లో 'నీతిమంతులకును, అనీతిమంతులకును "పునరుత్థానము" కలుగబోవుచున్నదని వీరు నిరీక్షించుచున్నట్లు నేనుకూడా నిరీక్షించుచున్నానని" పౌలు చెప్పెను. నీతిమంతులుకును, అనీతిమంతులకును "పునరుత్థానము" ఒక టేనని 'ఏకవచనము'లో చెప్పబడినది గాని 'పునరుత్థానములని' బహువచనములో చెప్పబడలేదు. పునరుత్థానము అనునది ఎప్పుడూ ఒక్కటే, అది చనిపోయినవా రందరికి ఒక్కసారి కలుగు స్థితి.

కొలస్స 1:18 - ".. ఆయన మృతులలోనుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను." అనగా first born from the dead - అని వున్నది.

ప్రకటన 1:5 "...మృతులలోనుండి ఆది సంభూతుడుగా లేచినవాడు" అని వున్నది. అనగా first born of the dead అని వుంది.

అ.కా. 23:6లో - "of the dead" అనియు

ఫిలిప్పీ 3:11లో "from the dead" అనియు

మత్తయి 22:30-31లో "of the dead" అనియు వున్నది. ఇవన్నియు ఒకే సంగతిని తెలుపుచున్నవి. గాని "వెయ్యేండ్ల పాలన" వారు చెప్పుచున్నట్లు "from the dead" అంటే చనిపోయిన వారిలో కొంతమంది అనిన్ని - "of the dead" అంటే మిగిలిన వారని అర్థ భేదములు లేవు. గనుక వారి సిద్ధాంతము, దేవుని వాక్యమునకు సరిపోవుట లేదు.

పునరుత్థానమనే మాట బైబిలు అంతటిలో, నీతిమంతుల విషయములోను, క్రీస్తునందుండి మృతులైనవారి విషయములోను, పరిశుద్ధుల విషయములోను, సదాకాలము ప్రభువుతోనుండు వారి విషయములో మాత్రమే ఉపయోగించబడినట్లు చూడగలము.

ప్రకటన 20:5లో "మొదటి పునరుత్థానము" అని చెప్పబడినది

కదా అని అనవచ్చును. గాని, యిదిగో "రెండవ పునరుత్థానమును" బైబిలులో ఎక్కడైన వున్నదా? లేదు. ఎందుకో మనకు తెలుసును. అది 'కడమ మృతులను' గూర్చి అని వారు గురుగులు, దుష్టుని సంబంధులు, దుర్నీతి పరులు, వారు వెళ్ళవలసినచోటు, ఏడ్పు, పండ్లు కొరుకుట వున్న అగ్ని ఆరని, పురుగు చావని అగ్నిగుండము (మార్కు 9:48). అటువంటి చోటుకు వెళ్ళుటకు వారికి తొందర ఏమిటి? కాని, క్రీస్తు బిడ్డలైతే ఎప్పుడు వెళ్ళి ప్రభువుతో గూడా వుందుమా అనెడి శుభ నిరీక్షణ కలిగి యున్నారు (తీతు 2:12-13). గనుక "పునరుత్థానము" అనే మాట వారికే చెందుచున్నది.

ప్రకటన 20:5లో వాడబడిన "మృతులు", "పునరుత్థానము" అను మాటలు ఉపమాన అలంకార రూపములో వాడబడినవి. యేసయ్య కూడా 'మృతులు' అనే మాటను అలంకార రూపములో మృతులు తమ మృతులను పాతిపెట్టుకొననిమ్ము (మత్తయి 8:22) అని చెప్పెను.

E. మొదటి పునరుత్థాన మనగా ఏమిటో చూతము :

అపొస్తలుడైన పౌలు చెప్పినదేమనగా, "మీరు క్రీస్తుతో కూడా లేపబడినవారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు, దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి యున్నాడు (కొలస్స 3:1). మరి కొలస్సి క్రైస్తవులు ఎప్పుడు చనిపోయిరి? ఎప్పుడు క్రీస్తుతో గూడ లేపబడిరి? "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడా పాతిపెట్టబడిన వారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుటద్వారా ఆయనతో కూడ లేచితిరి (కొలస్సి 2:12)" అని వున్నది. ఇదే భావము రోమా 6:3-5లో కూడా వున్నది.

ప్రకటన 20:6లో "ఈ మొదటి పునరుత్థానములో పాలుగల వారు, ధన్యులును, పరిశుద్ధులునై యుందురు. ఇట్టివారిమీద, రెండవ మరణమునకు అధికారము లేదు" అని వున్నది. క్రీస్తు నామమున

బాప్తిస్మము పొందుటయే "మొదటి పునరుత్థానము", అదే "రెండవ జన్మ" లేక "నూతన జన్మ"గా కూడ యోహాను 3:3, 5లో వున్నది. ఇట్టి అర్థములోనే 'పునరుత్థానమను' మాటను — యెషయ 1 : 18, యిర్మియా 31 : 33, యెహెజ్కేలు 11:19, 36:26, రోమా 6:8, 8:3, 12:2; 2 కొరింథి 5:17, గలతి 6:15, 16లోను చూడగలము. క్రీస్తును విశ్వసించి బాప్తిస్మము పొందుట ద్వారా 'రెండవ జన్మ' వలన 'మొదటి పునరుత్థానము' పాలివారయి, గొర్రెపిల్ల జీవగ్రంథములో పేర్లు వ్రాయించుకొని (లూకా 10:20, ఫిలిప్పి 4 : 3, ప్రకటన 3 : 5, 13:8, 17:8, 20:12) రెండవ మరణమైన అగ్నిగుండమును తప్పించుకొందురు (ప్రకటన 20 : 14-15). ప్రకటన 20 : 6 వచనములో 'ఇట్టివారి మీద రెండవ మరణమునకు అధికారము లేదు, అని అలంకార రూపములో చెప్పబడిన వాక్యము యొక్క అర్థము యిదే.

III క్రీస్తువారిని భూమికి ఎందుకు దించెదరు?

క్రీస్తువారు సశరీరుడుగా భూమిమీద జీవించి పాపులను రక్షించుటకు తన వంతు కార్యమును పూర్తిచేసి యిప్పుడు దేవుని కుడి పార్శ్వమున కూర్చొని యున్నాడు. రక్షణ మార్గమును సిద్ధపరచి వెళ్లినాడు. తండ్రియొద్దకు ఆ మార్గమున రమ్మనుచున్నాడు. ఆయన మరల భూమి మీదికి వచ్చి నివసించవలసిన అవసరము గాని, చేయవలసిన పని గాని లేదు.

(i) విమోచన కార్యక్రమము పూర్తియాయెను (ఎఫెసీ 1:7-10) "దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి......నిర్ణయించుకొనెను" క్రీస్తునందు మన అపరాధములకు క్షమాపణయు, ఆయన రక్తము వలన విమోచనము మనకు కలిగెను. యివన్నియు ఆయన రక్షణ సువార్తలో యిమిడి యున్నవి. యిదే, కాలము సంపూర్ణమైనప్పుడు జరుగవలసిన ఏర్పాటు - "సమస్తమును" క్రీస్తునందు ఏకముగా సమ

కూర్చెను - యిచట 'సమస్తము' అనునవి హెబ్రీ 1:3లోని, 'సమస్తము' ఒకటే. క్రీస్తునందు ఆ సమస్తము ఏకముగా చేయబడెను. అనగా 'క్రీస్తు సంఘము'లో సమస్తమునకు ఆయనను వారసునిగా చేసెను గనుక అది అయిపోయిన సంగతి. యిక భవిష్యత్తులో ఏకము చేయబడవలసినదేమియు లేదు.

(ii) క్రీస్తు మర్మము పూర్తిగా బయలు పరచబడెను (ఎఫెసి3:1-7).

"ఈ హేతువు చేత .....నేను పరిచారకుడనైతిని".

పౌలుయొక్క పై వాక్యములకు, యూదా 1:3కు కూడా కలిపిన "ప్రియులారా..... వ్రాయవలసి వచ్చెను".

పౌలు, యూదాలు యిద్దరు, అపొస్తలులకును, ప్రవక్తలకును బయలుపరచబడిన మర్మమును తెలుపుచున్నారు.

పౌలు ఆ మర్మమును "దేవుని కృప విషయమైన ఏర్పాటు" అనియు, యూదా దానినే "పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ (సువార్త)" అని వ్రాసెను. క్రీస్తునందలి రక్షణ పథకము పూర్తి అయినట్లును, యింక ఏ మాత్రము భవిష్యత్తుకొరకు మిగిలియుండలేదని తెలియుచున్నది.

(iii) ఆయన యిప్పుడు సర్వాధికారము కలిగియున్నాడు (మత్తయి 28:18-20). "అయితే యేసు వారి యొద్దకు......చెప్పెను". క్రీస్తువారికి పరలోకములోను, భూమి మీదను సర్వాధికారము యివ్వబడినది. ఆ అధికారమును బట్టే, తండ్రి కుమార పరిశుద్ధాత్మల నామమున బాప్తిస్మముద్వారా రక్షణ శాసనమును అమలులోనికి తెచ్చెను. ఈ బాప్తిస్మము మోషే ధర్మశాస్త్రమునకు సంబంధించినదికాదు; తాత్కాలికమైనది గాదు; దాని ఆజ్ఞలు సీనాయి కొండవికావు. ఇవి యుగాంతము వరకు వుండునట్టి అధికారయుక్తమైన గొప్ప శాసనము.

ఇదే రక్షణ పథకము. యింక వేరే ఏమియు మిగిలిలేదు, వేరే వుండ వలసిన అవసరముకూడా లేదు.

(iv) ఆయన రాజ్యము సంపూర్ణమైనది (కొలస్స 1:13)

"ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్యనివాసులనుగా చేసెను". ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను, ప్రభుత్వములైనను, ప్రధానులైనను, అధికారములైనను సర్వమును ఆయన యందు సృజింపబడెను. సర్వము ఆయనద్వారాను, ఆయన బట్టియు సృజింపబడెను (కొలస్స 1:16). సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు. ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము... మృతులలోనుండి లేచుటలో ఆది సంభూతుడాయెను. ఆయన యిప్పుడు సంఘమునకు శిరస్సు, రాజ్యములో రాజుగా వున్నాడు. భవిష్యత్తులో కాదు.

(v) ఆయన సింహాసనాసీనుడగుట పూర్తియాయెను (హెబ్రి 4:14) : "ఆకాశమండలము గుండ వెళ్ళిన......గట్టిగా చేపట్టుదము". ప్రకటన 3:21 : "నేను జయించి నా తండ్రితో కూడా ఆయన సింహాసనమందు కూర్చుండి యున్నాను. ఆ ప్రకారము జయించు వానిని నాతో కూడా నా సింహాసనమునందు కూర్చుండ నిచ్చెదను". యేసు క్రీస్తువారు, సింహాసనము మీాద ప్రధాన యాజకుడుగా వున్నాడు. ఆయన పరలోకములో వుంటేనే ప్రధాన యాజకుడుగా వుండుటకు వీలున్నది (హెబ్రి 8:4). గనుక ఆయన సింహాసనము పరలోకము లోనే యున్నది. 'తండ్రి సింహాసనము' అనగా 'యెహోవా సింహాసనము'. దావీదు సింహాసనము అంటే కూడా 'యెహోవా సింహాసనమే'. సొలొమోను తన తండ్రియైన దావీదు సింహాసమును అధిష్ఠించుట, యెహోవా సింహాసనమందు రాజుగా కూర్చుండి వర్ధిల్ల

చుండెనని I దిన 29 : 23లో వున్నది. ఇదే సంగతిని దావీదుకూడా చెప్పియున్నాడు- (1 దిన 28 : 5). ఈ సత్యమునే షేబదేశపు రాణి కనుగొనెను (II దిన 9 : 8). కనుక "వెయ్యేండ్ల పాలనవారు" చెప్పుచున్నట్లు, ఆయన 'దావీదుసింహాసనము' మీద కూర్చుండుటకు భూమి మీదికి రానవసరములేదు. దావీదు సింహాసనమే యిప్పుడు ఆయన ఆసీనుడై యున్న సింహాసనము. అక్కడ వుండే ఆయన సర్వ పరిపాలన చేయుచున్నాడు. ఆయన మరల వచ్చునది రాజ్యమును తండ్రికి యిచ్చివేయుటకేగాని, రాజ్యమును స్థాపించి 1000 సం॥లు పరిపాలించుటకుకాదని, II కొరింథి 15 : 24,25 లో స్పష్టముగానున్నది.

(vi) ఆయన నామము ప్రతినామము కంటె ఎంతో హెచ్చింపబడును (ఎఫెసి 1 : 20-21).

"ఆయన బలాతిశయము ... ... యున్నాడు". ఆకాశము నా సింహాసనము, భూమి నా పాదపీఠము అని యెషయా 66 : 1 లో చెప్పిన రీతిగా క్రీస్తువారు పరలోకములో వుంటేనే ఆయన సింహాసనము మీద అధికారము కలిగియున్నట్టు. నీవు నా కుమారుడవు, నేను నిన్ను కనియున్నాను అని దా॥కీ॥ 2 : 7లో ఉన్న ప్రవచనము నెరవేరినట్లు అ॥కా॥ 13 : 33లో తెలుపబడినందున, దేవుడు తన కుమారుని సింహాసనమందు ఆసీనునిగా చేసి సమస్తమును ఆయన పాదములక్రింద వుంచియున్నాడు. సంఘము ఆయన శరీరము. సంఘమునకు శిరస్సుగా ఆయన నియమింపబడుటే ఈ సర్వాధికారము. ఇది తెలియనికొందరు, ఆయనను మరల భూమికి రప్పించి ఆయన పాదపీఠము మీద ఆయనను కూర్చుండబెట్టి, ఆయన కాళ్ళు సింహాసనము మీద పెట్టి, అదే వెయ్యేండ్లపాలన అనజూచుచున్నారు కొందరు.

(vii) భూమి మీద ఆయన పని సంపూర్ణమాయెను : (యోహాను 17:1-4). "యేసు ఈ మాటలు చెప్పి...మహిమపరచితిని". పై వాక్యములోని "చేయుటకు నీవు నాకిచ్చిన పనిని నేను సంపూర్ణ

ముగా నెరవేర్చితిని" గమనింపవలెను. కాని 'వెయ్యేండ్లపాలనవారు' చెప్పున దేమనగా, ఆయన తన పనిని నెరవేర్చలేదు, వాయిదా వేసినాడు (Postponed) అని. భూమి మీద తన పని సమాప్త మాయెను (యోహాను 19:30). "నేనికను లోకములో వుండను" అని ఆయన చెప్పుచుంటే-లేదులే, నీకు దావీదు సింహాసనము వేస్తాము రమ్ము అంటున్నారు వెయ్యేండ్లపాలనవారు.

(ix) పాపముపైన, సైతానుపైన, మరణముపైన, ఆయన విజయము పూర్తియాయెను హెబ్రీ 2:14-15 "కాబట్టి ఆ పిల్లలు ... రక్తమాంసములలో పాలివాడాయెను". ఆయన చేయబోవు పనినంత టిని దృష్టిలో వుంచుకొని క్రీస్తువారు చెప్పిన దేమనగా: "ఒకడు మొదట బలవంతుని బంధింపని యెడల ఏలాగు ఆ బలవంతుని యింటిలో చొచ్చి అతని సామగ్రిని దోచుకొనగలడు? అట్లు బంధించిన ఎడల వాని యిల్లు దోచుకొనును (మత్తయి 12:29)". క్రీస్తువారు సైతా నును వానియింట్లో బంధించి, వాని సామగ్రియైన పాపులను రక్షించెను. పౌలు, కొలస్స 2:15లో చెప్పిన దేమనగా "ఆయన ప్రధానులను అధి కారులను నిరాయుధులనుగా చేసి, సిలువచేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనుబరచెను". "అందుచేత ఆరో హణమైనప్పుడు ఆయన, చెరను చెరగా పట్టుకొనిపోయి మనుష్యులకు ఈవులను అనుగ్రహించెను (ఎఫెసి 4:8)"

గనుక సమస్తమును ఆయన పాదముల క్రిందవుంచి సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించినందున-రాజ్య స్థాపన మానుకొని తాత్కాలికముగా సంఘము స్థాపించినాడని చెప్పు చున్న 'వెయ్యేండ్లపాలనవారి' మాటలు బూటకములు, గాలి మాటలు ఎందుకంటే-

"దేవునికి, క్రీస్తుయేసు మూలముగా
సంఘములో తరతరములు సదాకాలము
మహిమ కలుగునుగాక, ఆమెన్." —ఎఫెసి 3:21.

(సమాప్తము)

## గమనిక

క్రైస్తవ కీర్తనల పుస్తకము తిరిగి ముద్రించబడి ఇప్పుడు మావద్ద దొరుకుచున్నది. కొన్ని క్రొత్త కీర్తనలు చేర్చబడి అందముగా బైండింగ్ చేయబడినది. పుస్తకము ఖరీదు రూ **6/-** మాత్రమే. ఆర్డినరి పోస్టేజి 0-50 పైసలు అదనం. వలయు వారు ఈ దిగువ చిరునామాకు M. O. పంపి పొందండి.

SATYAVANI

P.O. Box 80, KAKINADA-533 001.

**Regd. No. H/KD—45/KD.H.O.**

*From*

**SATYAWAKKU**

**P.O. Box. 80**

**KAKINADA-533 001**

**No.**

**To**

..............................................

..............................................

..............................................

..............................................